కోమటి చెరువుకు కలువ అందాలు

మనుసు పెట్టి చూడాలే కానీ.. ప్రకృతి క్యాన్వస్‌పై ఎన్నో సుమధుర దృశ్యాలు.. సిద్దిపేట కోమటి చెరువు అంటేనే ఆహ్లాదానికి మారుపేరు. ఆ చెరువులో పరుచుకున్న తామరపూలు కోమటి చెరువుకు కొత్త అందాలను తీసుకువచ్చాయి. నింగిని అంటేలా ఎగురుతున్న జాతీయ జెండా ఒకవైపు, నీటిలో వికసిస్తున్న జాతీయ పుష్పం మరోవైపు కనువిందు చేస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



డెంగ్యూ పంజా





సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రిస్క్రిప్షన్ కోసం వైద్యుడి వద్ద రోగులు

- సిద్దిపేటలో ఐదేళ్ల బాలుడి మృతి
- కదిలిన జిల్లా యంత్రాంగం
- జిల్లాలో వందల సంఖ్యల్లో కేసులు
- ప్రభుత్వ లెక్కల ప్రకారం పదుల సంఖ్యలోనే
- ఇంటింటా జ్వర సర్వేకు కలెక్టర్ ఆదేశం
- గత నెలలోనే జ్వర సర్వే నిర్వహణ.. తూతూ మంత్రంగా చేశారని ఆరోపణలు
- అపరిశుభ్రంగా పలు గ్రామాలు, పట్టణాలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25 : జిల్లాలో డెంగ్యూ వ్యాధి చాప కింద నీరులా పంజా విసురుతున్నది. సిద్దిపేట పట్టణంలో శనివారం ఐదేళ్ల బాలుడిని బలిగొంది. ఘటనపై ఎట్టకేలకు స్పందించిన కలెక్టర్ మనుచౌదరి జిల్లా వ్యాప్తంగా మరోసారి జ్వర సర్వే చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

నాలుగు రోజుల పాటు సర్వే

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉండడంతో ముందస్తు చర్యలలో భాగంగా గత నెల జూలైలో జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వేను నిర్వహించారు. అయితే, తాజాగా బాలుడి మృతితో కలెక్టర్ ఆదేశాలతో ఈ నెల 26 నుంచి 30 వరకు వైద్య శాఖ బృందం సర్వే నిర్వహించనున్నది. దీంతో జిల్లాలోని 33 పీహెచ్‌సీ, 2 అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో, వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జర్వ పీడిత బాధితుల్ని గుర్తించి వారి వివరాలను నమోదు చేయనున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైరల్ ఫీవర్, మలేరియా, డెంగ్యూ చికున్ గున్యా నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.40 లక్షల నివాసాలున్నట్లు వైద్య శాఖ అధికారులు గతంలోనే గుర్తించారు.



చేర్యాలలో మురుగు పరుగు

సర్వేలో ఏఎన్ఎమ్‌లతో పాటు ఆశావర్కర్‌లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్), మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొంటారు. బృందాలుగా నాలుగు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. సర్వేలో భాగంగా జ్వర కేసులను గుర్తిస్తే వాటిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపనున్నారు. అక్కడి మెడికల్ ఆఫీసర్ జ్వర బాధితులను పరీక్షించి, అవసరమనుకున్న కేసులను సమీపంలోని పెద్దాస్పత్రులకు పంపించి మెరుగైన వైద్యాన్ని అందించనున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వర్షపు నీరు నిల్వలేకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు, డ్రైడేపై పలు గ్రామాల్లో ప్రజల్లో అవగాహన కల్పించేలా అధికారులు కృషి చేస్తున్నారు. ప్రత్యేకంగా జిల్లాలోని పట్టణాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో వార్డుల్లో దోమల మందు పిచికారీ చేయడంతో పాటు సాయంత్రం పూట ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో, పట్టణాలోని వార్డుల్లోని గుంతలలో వర్షపు నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు దోమల మందులను పిచికారీ చేస్తున్నారు. వానకు నీటి తొట్లలో నిండిన వర్షపు నీరును, నీటి హౌజులు, డ్రమ్ములలో ఎక్కువ రోజులుగా నిల్వఉంచిన నీరును అధికారులు పారబోస్తూ ప్రజల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన పెంపొందిస్తున్నారు. అయినప్పటికీ పలు గ్రామాల్లో ఇంకా అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆయా శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డెంగ్యూ లక్షణాలు

పగటిపూట కుట్టే ఎడిస్ ఈజిప్ట్ జాతి దోమలతో డెంగ్యూ ప్రబలుతుంది. దోమ కుట్టిన తర్వాత ఐదు నుంచి వారం రోజుల్లో డెంగ్యూ లక్షణాలు బయటపడుతుంటాయి. సాధారణ జ్వరంలా రావచ్చు. కళ్ల మంటలు, శరీరంపై దద్దుర్లు రావడం, వాంతులు, విరేచనాలు, చిగుళ్ల, ముక్కు నుంచి రక్తస్రావం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తెల్లరక్త కణాల సంఖ్య బాగా తగ్గుతుంది. తీవ్ర జ్వరం వస్తుంది. ఆకస్మాత్తుగా ఎముకలు, కండరాళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. జ్వరం తగ్గినట్టే అనిపించి వారం, పది రోజుల్లో మళ్లీ వస్తుంటుంది. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. తెల్ల రక్తకణాల సంఖ్య 30 వేల దిగువకు ప్రమాదకరం. మెదడు, ఇతర అవయవాలపై ప్రభావం చూపి ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చు. రెండు, మూడు రోజులు జ్వరం ఉంటే వెంటనే టెస్ట్ చేయించుకోవాలి. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలి. జాగ్రత్తలన్నీ పాటిస్తూ సమయానికి మందులు తీసుకోవాలి.



సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద రద్దీ

మంచం పడుతున్న పల్లె, పట్టణం

అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ విష జ్వరాలు ప్రబలుతూనే ఉన్నాయి. వాతావరణ మార్పులతో, దోమల వృద్ధితో గ్రామాలు, పట్టణాలో చాలా మంది జ్వరంతో బాధపడుతున్నారు. నొప్పులు, జలుబు, దగ్గుతో మొదలవుతున్న జ్వరాలు ఎంతకూ తగ్గక మంచం పడుతున్నారు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న కేసులు ప్రైవేటు ఆస్పత్రులలో ఎక్కువగా నమోదవుతున్నాయి. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, గజ్వేల్‌లోని జిల్లా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగానే ఉంది. పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు జ్వర పీడితులు ఎక్కువగానే వస్తున్నారు. సాధారణ జ్వరంగా భావించి చాలా మంది నిర్లక్ష్యం చేస్తుండడంతో పరిస్థితి తీవ్రమవుతుందని తెలుస్తుంది. రక్త పరీక్షలు, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలను ఆలస్యంగా తెలుసుకోవడంతో సరైన వైద్యం సమయానికి అందడం లేదు. దీంతో రోగుల కోలుకోవడానికి చాలా రోజులు పడుతున్నది. ఇదే అదనుగా ప్రైవేటు ఆస్పత్రులలో అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రక్త నిర్ధారణ పరీక్షల పేరిట, ప్లేట్‌లెట్లు తగ్గాయని చెబుతూ రోగుల జేబుల గుల్ల చేస్తున్నారు. ఇన్‌పెషెంట్‌గా అడ్మిట్ చేసుకుని వేలల్లో బిల్లులు వేస్తున్నారని రోగుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

వందల్లో అనధికార డెంగ్యూ కేసులు

జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ కేసులు వందల సంఖ్యలో నమోదవుతుండగా, పదుల సంఖ్యలో మాత్రమే డెంగ్యూ కేసులున్నట్లు ఆ శాఖ అధాకారులు వెల్లడిస్తున్నారు. జర సర్వేలో ప్రజలు సర్వేకు సహకరించక పోవడంతో పాటు, వైద్య శాఖ అధికారులు కూడా తూతూ మంత్రంగా సర్వే నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జ్వరం రాగానే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లకుండా, ప్రైవేట్‌కు పరుగులు తీస్తుండటంతో వాస్తవానికి ఎన్ని కేసులు నమోదవుతున్నాయో వైద్య శాఖ అధికారులు పూర్తిస్థాయిలో తెలుసుకోలేక పోతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు డెంగ్యూ నిర్ధారణ అయితే ఆ విషయాన్ని ఆయా హాస్పిటల్‌ల యజమాన్యం కూడా వైద్య శాఖ అధికారులకు వెల్లడించడంలేదు.

పంచాయతీ ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలి

- ప్రతీ పంచాయతీకి రూ.50 వేలు ఇవ్వాలి
- హైడ్రా మంచి పనులు చేస్తుంది
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 25 : రాష్ట్రంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోతున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.50వేలు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో డెంగ్యూ కేసులు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రభుత్వ ఆస్పత్రులలో కనీసం బెడ్‌లు దొరికే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ఆరోగ్య శాఖ మంత్రి స్పందించి ఆసుపత్రులను సందర్శించాలన్నారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఢిల్లీకి వెళ్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిల్లో సిబ్బందిని కేటాయించాలన్నారు. హైడ్రా మంచి పని చేస్తుంది, కానీ హైడ్రా పేరుతో సమస్యలను పుట్టించవద్దన్నారు. చెరువులు కబ్జా చేస్తే ఎవరిపైనా అయినా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కృష్ణస్వామి విగ్రహానికి నివాళి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 25 : కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు నుంచి జాతి కోసం, బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన మహనేత కృష్ణస్వామి అని కొనియాడారు. హైదరాబాద్ ఫస్ట్ మేయర్ రచయిత చరిత్రకారుడు అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. ఆయన బాటలో ముదిరాజులు, బహుజనులు నడవాల్సిన అవసరం ఉందని అన్నారు.

సిద్దిపేటలో పట్టపగలే దొంగల హల్‌చల్

- శ్రీనగర్‌కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లల్లో చోరీ
- ఒకరింట్లో రూ.2 లక్షలు, మరొకరి ఇంట్లో 8 తులాల బంగారం, 60 తులాల వెండి దోపిడీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 25 : సిద్దిపేటలో పట్టపగలే దొంగలు తాళం వేసిన ఇళ్లల్లో చొరబడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఓ ఇంట్లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో రాజు, మూడో అంతస్తులో కృష్ణమూర్తి నివాసం ఉంటారు. కృష్ణమూర్తి భార్య ఊరికి వెళ్లగా ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి ఆయన బయటకు వెళ్లాడు. తిరిగివచ్చేసరికి ఇంట్లో సామగ్రి చిందరవందర పడి ఉండడాన్ని గమనించాడు. బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.15,000 నగదు దొంగిలించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంటున్న రాజు వృత్తిరీత్యా బయటకు వెళ్లాడు. అతని భార్య మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పిల్లలను తీసుకొచ్చేందుకు స్కూలుకు వెళ్లింది. తిరిగొచ్చేసరికి ఇంట్లో రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఇద్దరు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించాయి. బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అదే ఇంట్లో రెండో అంతస్తులో తాళం వేసిన ఇంట్లో కూడా తాళం పగులగొట్టి చొరబడ్డారు. ఆ ఇంట్లో ఏమీ తీసుకెళ్లకపోవడంతో బాధితులు పిర్యాదు చేయలేదు. ఒకే రోజు మూడు ఇళ్లల్లో దొంగలు పడేసరికి కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఊపిరి ఉన్నంతవరకు కృషి

- సిద్దిపేటను చూసి ఓర్వలేకే అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు
- రూ.150 కోట్ల వెటర్నరీ కళాశాలను సీఎం కొడంగల్‌కు గద్దలా తన్నుకుపోయాడు
- ముస్తాబద్ చౌరస్తా ఇక నుంచి కృష్ణస్వామి జంక్షన్
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25 : ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 251 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సిద్దిపేటలోనే అత్యధిక సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిన నియోజకవర్గంగా ఉందన్నారు. ప్రజలు కష్టాల్లో, ఆపదల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం పొందితే, కొంత మొత్తాన్ని ఉడతాభక్తిగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం చేస్తున్నట్లు చెప్పారు. అందుకు తమవంతు కృషి చేసిన స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. సగం నిర్మాణం పూర్తయిన వెటర్నరీ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించుకుపోయారని మండిపడ్డారు. కొడంగల్‌కు అవసరమైతే నూతన కళాశాలను నిర్మించుకోవాలని, సిద్దిపేటకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.150 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కళాశాలను గద్దలా తన్నుకుపోయిన తీరును ప్రజలు గమనించాలని కోరారు. కొమటిచెరువు వద్ద నిర్మిస్తున్న శిల్పారామం పనులు ఆగిపోయాయని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుంటున్నదని ఆరోపించారు. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేటకు రావాల్సిన పనులను హక్కుగా తీసుకొని వస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు గ్యాదరి రవీందర్, కలకుంట్ల మల్లికార్జున్, బర్ల మల్లికార్జున్, బ్రహ్మం, తాడూరి సాయిఈశ్వర్‌గౌడ్, నాయకులు పాల సాయిరాం, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణస్వామి విగ్రహానికి పూలమాల వేస్తున్న హరీశ్‌రావు

కృష్ణస్వామి స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగాలి

కొరివి కృష్ణస్వామి ఇచ్చిన స్ఫూర్తితో ముదిరాజ్ సమాజమంతా ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ రోడ్డులో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ముదిరాజ్ సమాజ్ సభ్యులతో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తొలి మేయర్‌గా కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ నగరానికి ఎంతో సేవలు అందించారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ముదిరాజ్ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ముదిరాజ్ ఆత్మగౌరవ భవనాన్ని సిద్దిపేటలో నిర్మించుకున్నామన్నారు. మత్స్యకారులకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కొత్త సభ్యత్వ కార్డులను బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మంజూరు చేసినట్లు తెలిపారు. ముస్తాబాద్ చౌరస్తాను కృష్ణస్వామి జంక్షన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.



సిబ్బందిపై మండిపడుతున్న హరీశ్‌రావు

20 ఏళ్లుగా చెట్లను పసిపిల్లల్లా పెంచాం

చెట్లను నరకడంపై హరీశ్‌రావు ఫైర్

సిద్దిపేట పట్టణంలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయని ఏపుగా పెరిగిన చెట్లను ఇష్టం వచ్చినట్లుగా నరికివేస్తుండటంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో పర్యటనలో భాగంగా అధికారులు చెట్లను నరికివేస్తుండటంతో విషయాన్ని గమనించిన ఆయన తన వాహనాన్ని ఆపి, చెట్లను ఎందుకు నరికివేస్తున్నారని అధికారులు, సిబ్బందిని నిలదీశారు. 20 ఏళ్లుగా పసిపిల్లల్లా పెంచామని, చెట్ల కొమ్మలను నరకాలి తప్ప, చెట్లను కాదని మండిపడ్డారు. పూర్తిగా చెట్లను తీసేయడంపై విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నించారు. చెట్లను నరికివేయాలని ఆదేశించిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

దేశభక్తి పెంపొందించేవి సరస్వతీ పాఠశాలలు

విద్యార్థులకు సామాజిక బాధ్యత, దేశభక్తిని పెంపొందించేవి సరస్వతి పాఠశాలలని ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం సిద్దిపేటలోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిగా తాను పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాను ఒకటో తరగతి నుండి ఆరో తరగతి వరకు సరస్వతి శిశు మందిరంలో చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు.

'మహాలక్ష్మి' సబ్సిడీకి మోక్షం

- లబ్ధిదారుల ఖాతాల్లోకి గ్యాస్ సబ్సిడీ నిధులు జమ
- జిల్లాలో 1.65 లక్షల మందికి లబ్ధి
- రూ.9.84 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 25: ఆరు గ్యారెంటీలో భాగంగా వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల వేళ హామీ ఇచ్చింది. దీనిలో భాగంగానే మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వంటగ్యాస్‌ను రూ.500కే అందజేస్తోంది. తెల్ల రేషన్‌కార్డు కలిగి ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన వారికి క్రమంగా సబ్సిడీలు విడుదల చేస్తోంది. మొదటి రెండు నెలల్లో విడుదల కొంత ఆలస్యం కాగా.. గత నెల నుంచి సబ్సిడీ డబ్బు వేగంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,65,912 మందికి గ్యాస్ సబ్సిడీ వర్తిస్తోంది. గ్యాస్ వినియోగదారులు రూ.874 చెల్లించి సిలిండర్ తీసుకోగా.. వారి ఖాతాల్లోకి రూ.374 ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా చేరవేస్తోంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సైతం సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో పంపుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 9.84 కోట్లు వినియోగదారుల ఖాతాల్లో జమ చేశారు.

జిల్లా వివరాలు

మొత్తం గ్యాస్ వినియోగదారులు	3,19,246
మహాలక్ష్మి పథకం వర్తిస్తున్నవారు	1,65,912
ఇప్పటి వరకు పంపిణీ చేసిన సిలిండర్లు	3,23,012
ఖాతాల్లో జమైన సబ్సిడీ	రూ. 9.84 కోట్లు



కొందరికి మొండిచేయి

మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో సరైన పత్రాలు సమర్పించలేదని కొందరివి తిరస్కరించగా.. గ్యాస్ డీలర్ల నుంచి పాస్‌బుక్ నంబర్లు నమోదు చేయించుకోలేదని మరికొందరు అనర్హులుగా మిగిలిపోయారు. నగదు జమవుతున్నట్లు సమాచారం వచ్చినప్పటికీ ఖాతాల్లో చూపడం లేదని పలువురు వాపోతున్నారు. అయితే ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు కలిగిన వారిలో చివరగా దేనికి కేవైసీ చేయించారో అందులోనే సబ్సిడీ జమవుతున్నట్లు ఏజెన్సీల నిర్వాహకులు తెలిపారు.

లబ్ధిదారులకు నేరుగా ఖాతాలో జమ

మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తుంది. అందులో బాగంగానే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేసింది. ఈ సబ్సిడీ నగదును లబ్ధిదారులకు నేరుగా ఖాతాలో జమ అవుతున్నాయి.

- తనూజశ్రీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



ప్రియురాలు దక్కలేదని యువకుడి ఆత్మహత్య


చెందుబాబు(ఫైల్)

మనోహరాబాద్, ఆగస్టు 25: ప్రేమించిన అమ్మాయి దక్కడంలేదన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లికి చెందిన బండారి చందుబాబు(25) ఓ అమ్మాయిని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. ఇది తెలుసుకున్న చందు తల్లిదండ్రులు అమ్మాయి తల్లిదండ్రులతో వివాహం విషయమై మాట్లాడగా వారు నిరాకరించారు. అనంతరం ఆ అమ్మాయికి వేరే పెళ్లి సంబంధం చూశారు. దీంతో మనస్తాపానికి గురైన చందుబాబు ఈ నెల 13న గ్రామ శివారులో పురుగుల మందుతాగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని వెంటనే అతడిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ములుగు మండలం లక్ష్మక్కపలిలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయినా పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మృతుడి తల్లి బండారు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులే వంటచేయాలే..!



కౌడిపల్లి, ఆగస్టు 25 : కౌడిపల్లి మండలం వెల్మకన్నెలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులే వంట చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. 105 మంది విద్యార్థులు ఉంటున్న ఈ హాస్టల్‌లో వంట చేసే కామటి సావిత్రి గత మె నెలలో మృతి చెందగా.. మరొకరు మల్లేశం అనారోగ్యంతో నాలుగు రోజులుగా విధులకు రావడంలేదు. ఆదివారం ఉదయం హాస్టల్‌లో ఓ విద్యార్థి చికెన్ కడుగుతూ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కెమెరాకు చిక్కాడు. ఈ విషయంపై వార్డెన్ జయరాజ్‌ను వివరణ కోరగా వంట మనిషి లేక సమస్య ఏర్పడి ఉంటుందని, తిరిగి పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.


మేడ్చల్ జిల్లా బాచుపల్లిలోని ఈఎస్ఐ ప్రాంతీయ వైద్య కేంద్రం

అత్యవసర సేవలు..
అందనంత దూరం

● సమస్యలు ఓ చోట.. కార్యాలయాలు మరోచోట
● దూరాభారంతో ప్రజలకు తప్పని కష్టాలు
● స్థానికంగా ఏర్పాటు చేయాలంటున్న జనం

జిన్నారం, ఆగస్టు 25: పారిశ్రామిక మండలమైన జిన్నారంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన పలు ముఖ్యమైన అధికారుల కార్యాలయాలు ఎక్కడో దూరంగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈఎస్ఐ వైద్యశాల మండలానికి దూరంగా పక్క జిల్లాలో ఉండగా.. అగ్ని ప్రమాదాలను నివారించాల్సిన ఫైర్‌ఇంజిన్ కూడా పక్క జిల్లాల నుంచి రావాల్సిందే. ఫిర్యాదుదారులు పీసీబీ అధికారుల, పరిశ్రమల భద్రతా విభాగం కార్యాలయాలకు వెళ్లాలన్నా దూరాభారం తప్పడంలేదు. నాలుగు రోజుల్లో కిష్టయ్యపల్లి గ్రామంలో కాలుష్య వ్యర్థ జలాలు తాగి 9 పాడి గేదెలు మృతి చెందగా.. బాధితులు గేదెల కళేబరాలతో సనత్‌నగర్‌లోని పీసీబీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిరంతరం నిఘా కోసం పారిశ్రామిక వాడలో పీసీబీ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం ఇక్కడి పరిస్థితికి నిదర్శనం

వైద్యానికి దూరాభారం..

జిన్నారంలో అధికారుల కార్యాలయాలు, వైద్యశాల అందుబాటులో లేక ప్రజలు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. 350 పరిశ్రమలు, 70 వేల మంది కార్మికులు, సుమారు 50 వేల మంది ఈఎస్ఐ బీమా వైద్యం అర్హులు ఉన్న ఈ మండలంలో చికిత్స అందించే చిన్నపాటి డిస్పెన్సరీ లేదు. జిన్నారం, వావిలాల, కొడకంచి, గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారంలో పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో పని చేసే కార్మికులు బీమా వైద్యం అందుబాటులో లేక స్థానిక ప్రైవేటు క్లీనిక్‌లను ఆశ్రయిస్తున్నారు. బొల్లారంలో గతంలో ఉన్న ప్రాంతీయ ఈఎస్ఐ వైద్య కేంద్రాన్ని 2019లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లికి తరలించారు. దీంతో ఈ ప్రాంత కార్మికులు వైద్యం కోసం వెళ్లాలంటే వ్యయాప్రయాసలు తప్పడంలేదు. బొల్లారంలో ఈఎస్ఐ భవనం కోసం స్థలాన్ని కేటాయించినా నిధుల మంజూరుకు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదు. బొల్లారం సహా గడ్డపోతారంలో ఈఎస్ఐ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా ఉన్నది.

తప్పని నిరీక్షణ..


రామచంద్రాపురంలోని పీసీబీ కార్యాలయం

పారిశ్రామిక ప్రమాదాల నివారణకు అత్యవసరమైన ఫైర్‌స్టేషన్ స్థానికంగా అందుబాటులో లేక ప్రమాదాల తీవ్రత అధికమవుతున్నది. ఇక్కడ ఉన్నవాటిలో 80 శాతం రసాయనిక పరిశ్రమలేకాగా తరుచూ చిన్న చితక, భారీ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ 20 కి.మీటర్ల దూరం నుంచి ఫైర్ ఇంజిన్ల రాక కోసం నిరీక్షణ తప్పడం లేదు.. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రమవుతున్నది. గడ్డపోతారం, లేదా బొల్లారంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదన అమలుకు నోచుకోవడం లేదు.

పీసీబీ, భద్రతా కార్యాలయాలూ దూరమే..

మండలంలో నిత్యం సేవలు అవసరం ఉన్న పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు), పరిశ్రమల భద్రతా తనిఖీల విభాగం అధికారుల కార్యాలయాలూ స్థానికంగా అందుబాటులో లేవు. జల, వాయు, ఘన కాలుష్యం పై ఫిర్యాదులు చేయాలంటే రామచంద్రాపురంలోని పీసీబీ ప్రాంతీయ కార్యాలయం వెళ్లాల్సి వస్తున్నది. ఫిర్యాదుల పరిశీలనకు అధికారులు వచ్చే లోపే సమస్య రూపు మారడంతో పక్కదారి పడుతున్నది. నిత్యం వేలాది మందికి సేవలు అందించే ఈ కార్యాలయాలను స్థానికంగా మండల పరిధిలో ఏర్పాటు చేయాలని మండల వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమాజ శ్రేయస్సుకోసమే
విశ్వశాంతి యాత్ర


విశ్వశాంతియాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్

పటాన్‌చెరు, ఆగస్టు 25: సమాజ శ్రేయస్సుకోసమే వీరశైవలింగాయత్ సమాజం ఆధ్వర్యంలో విశ్వశాంతి పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఇది ఎంతో స్ఫూర్తి నింపుతున్నదని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు వీరశైవలింగాయత్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఉమామహేశ్వర ఆలయం నుంచి బొంతపల్లి వీరబద్ర ఆలయం వరకు చేపట్టిన పాదయాత్రను వారు ప్రారంభించారు. సమసమాజం కోసం 12వ దశాబ్దంలోనే మహాత్మా బసవేశ్వరుడు చేపట్టిన సంఘ సంస్కరణలు ఎంతో ప్రభావం చూపాయన్నారు. నేటి మన భారత రాజ్యాంగం సైతం ఆయన ఆదర్శాలనే కొనసాగిస్తున్నదన్నారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నిర్వహకుడు అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


రేణుక

మనోహరాబాద్, ఆగస్టు 25 : ఇంట్లో గొడవపడి బయటికెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం కాళ్లకల్ గ్రామానికి చెందిన ఉట్ల రేణుక(35) భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి పని నిమిత్తం హైదారాబాద్‌లోని అల్వాల్ బొల్లారంలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఇంట్లో దంపతుల మధ్య గొడవ కావడంతో బుధవారం రేణుకను తన తల్లిగారి గ్రామం రంగాయపల్లి వద్ద భర్త వదిలివెళ్లాడు. దీంతో శుక్రవారం రేణుక తన తల్లికి దండుపల్లికి వెళ్తున్న అని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. విషయం తెలిసిన భర్త చుట్టుపక్కల, బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో ఆదివారం భర్త ఉట్ల పాండు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

రక్తమోడిన రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● పలువురికి గాయాలు



నారాయణఖేడ్: శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, నేషనల్ హైవే సిబ్బంది

నారాయణఖేడ్, ఆగస్టు 25: ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, సిద్దిపేట జిల్లా కొండపాక, చేర్యాల మండలాల్లో చోటు చేసుకున్నది. ఎదురుగా వస్తున్న లారీని బైక్‌తో రాంగ్‌రూట్‌లో వెళ్లి ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మృతిచెందారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. కంగ్టి మండలం బీంరాకు చెందిన సునీల్, మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుక నారంగల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(27) బైక్‌పై జోగిపేట వైపు వెళ్తున్నారు. నారాయణకేడ్ పరిధిలోని నిజాంపేట సమీపంలో జాతీయ రహదారి 161పై హర్యానాకు చెందిన లారీ నాందేడ్‌కు వెళ్తుండగా.. రాంగ్‌రూట్‌లో వెళ్లిన వీరు ఢీకొట్టారు. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాల పాలైన సునీల్‌ను మెరుగైన వైద్యం కోసం జోగిపేట ఆస్పత్రికి తరలించగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రాంగ్‌రూట్‌లో రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

చేర్యాల మండలంలో...



గాయాలపాలైన బోయన్నగారి బాలకృష్ణ

చేర్యాల, ఆగస్టు 25: చేర్యాల పట్టణ శివారు నర్సాయపల్లి దారిలో బొలెరో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. కర్నూలు జిల్లా దోన్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన బోయ హరి(26)తో పాటు నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గూటిపల్లి గ్రామానికి చెందిన బోయన్నగారి బాలకృష్ణ తదితరులు నర్సాయపల్లి శివారులో ఓ భవన నిర్మాణం కూలీ పనులు నిర్వహిస్తున్నారు. ఆదివారం చేర్యాల పట్టణంలో సామగ్రి కొనుగోలు చేసి బైక్‌పై తిరిగి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొన్నది. ఈ ఘటనలో హరి అక్కడికక్కడే మృతిచెందగా.. బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వ్యవసాయ బావుల వద్ద ఉన్న రైతులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. బాలకృష్ణను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కొండపాక మండలంలో..



వీరేశం(ఫైల్)

కొండపాక, ఆగస్టు 25: కొండపాక శివారులోని ఆనంద నిలయం వృద్ధాశ్రమం సమీపంలో రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వెళ్తున్న కారు డ్రైవర్ వేగంగా వెళ్లి ముందుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టి సడన్ బ్రేక్ వేశాడు. కారు వెనకాలే వస్తున్న మరో ద్విచక్ర వాహనం కారుకు తగిలి ముందుకు వెళ్లి.. మరో బైక్‌కు తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన అందే వీరేశం(36) తలకు బలమైన గాయాలయ్యాయి. అలాగే మరో బైక్‌పై ఉన్న దుద్దెడ గ్రామానికి చెందిన రాకేష్, లక్ష్మణ్‌కు గాయాలు కాగా.. వీరిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అందే వీరేశం చికిత్స పొందుతూ మృతిచెందాడు. వీరేశం గురువన్నపేట నుంచి శనిగరం బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రోడ్డెట్ల ఉందిర బావో..

● బస్సు నడుపుతూ పాటందుకున్న డ్రైవర్

● సోషల్ మీడియాలో వైరల్



డ్రైవింగ్ చేస్తూ పాట పాడుతున్న ఆర్టీసీ డ్రైవర్

మునిపల్లి, ఆగస్టు 24 : గుంతలమయంగా ఉన్న రోడ్డుపై బస్సును నడుపుతూ ఓ ఆర్టీసీ డ్రైవర్.. రోడ్ల దుస్థితి, డ్రైవర్ల కష్టాలను పాట రూపంలో ప్రయాణికులకు వినిపించాడు. కొందరు ఫోన్‌లో రికార్డు చేసి పోస్టు చేయడంతో సోషల్ మీడియాలో ఆ వీడియో కాస్త వైరల్ అయ్యింది. సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సదాశివపేట నుంచి మునిపల్లి మండలం కంకోల్, తాటిపల్లి గ్రామాల మీదుగా మక్తక్యాసారంకు నడుస్తుంది. తాటిపల్లి నుంచి మక్తక్యాసారం వరకు సుమారు 9కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును మరమ్మతుల కోసం తవ్వారు. నెలలు గడుస్తున్నా ఆ పనులు పూర్తికాకపోవడంతో, వర్షాలకు గుంతమయంగా మారింది. ఆ దారిలో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆదివారం ఈ రోడ్డు గుండా ఆర్టీసీ బస్సు నడుపుతున్న ఓ డ్రైవర్ రోడ్డు పరిస్థితిని చూసి "ఈ రోడ్డెట్ల ఉందిర బావో.. మక్తక్యాసారం రోడ్డెప్పుడు మారుతుందిరో మావో.. అంటూ పాటందుకున్నాడు. అది కాస్త వైరల్ అయ్యింది.

ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం



కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పోషకాహార నిపుణులు డా. సలోమియేసుదాస్

● ఆకుకూరల సంప్రదాయాన్ని సమాజానికి పరిచయం చేద్దాం

● పోషకాహార నిపుణులు డాక్టర్ సలోమియేసుదాస్



ఆకుకూరల ప్రయోజనాల గురించి డీడీఎస్ సభ్యులను అడిగి తెలుసుకుంటున్న సందర్శకులు

జహీరాబాద్, ఆగస్టు 25: మనం నిత్యం తీసుకునే ఆహారంతోపాటు ఆకుకూరలను కలుపుకుని తింటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని పోషకాహార నిపుణులు డా. సలోమియేసుదాస్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ మండలంలోని అల్గోల్‌లో గల కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం-డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ)-డీడీఎస్ ఆధ్వర్యంలో ఆకుకూరల పండుగను నిర్వహించారు. ముందుగా వారంతా ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లిలో డీడీఎస్ మహిళా సంఘం నాయకురాలు పొట్టిపల్లి మొగులమ్మ పంట పొలాన్ని సందర్శించారు. పొలాల్లో ఏ రకమైన ఆకుకూరలు దొరుకుతాయని, తదితర వివరాలను అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామ శివారులో గల కేవీకేలో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, మహిళలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతిలో సహజసిద్ధంగా ఐదు రకాలకు పైగానే గడ్డి మొక్కలు ఉంటాయన్నారు. అందులో ఆకుకూరలు, ఔషధ మొక్కలు, కలుపు మొక్కలు, కంపోస్టు ఎరువు తయారీకి ఉపయోగపడే మొక్కలు, పశువులకు మేతగా ఉపయోగపడే మొక్కలు ఉంటాయన్నారు. సహజసిద్ధంగా లభించే ఆకు కూరలకంటూ ప్రత్యేకంగా విత్తనాలు దొరకవని, వాటంతట అవే భూమిపై, పంట పొలాల్లో మొలకెత్తుతాయని పేర్కొన్నారు. ఒక్కో ఆకుకూరతో ఒక్కో రకమైన ప్రయోజనం ఉంటుందని, 40 రకాల ఆకుకూరల వివరాల గురించి వివరించారు. గత 20 ఏళ్ల కిందటే డీడీఎస్ ఆధ్వర్యంలో సాగుచేయని ఆకుకూరలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్(ఎన్ఐఎన్) వారితో కలిసి పరిశోధనలు చేశామన్నారు. తమ పరిశోధనల ద్వారా మార్కెట్‌లో లభించే ఆకు కూరలకంటే సహజ సిద్ధంగా లభించే ఆకు కూరల్లో చాలా పోషకాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నేటికీ ఆకు కూరలు మరిచిపోకూడదనే సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకుని.. డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో ప్రతియేటా ఆకుకూరల పండుగను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జీవవైవిధ్య రైతులు లక్ష్మమ్మ, చంద్రమ్మ, మొగులమ్మ మాట్లాడుతూ పంట పొలాల్లో సహజంగా లభించే ఆకుకూరలను కలుపు మొక్కలుగా పరిగణిస్తూ.. రైతులు రసాయనాలను పిచికారీ చేయడంతో వాటి ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. మనం మరిచిపోతున్న ఆకుకూరలకు మార్కెట్లో మరింత డిమాండ్ ఉందని వారు గుర్తుచేశారు. సహజంగా తుమ్మికూర, తట్టెల్లి, అడవిమెంతం, జొన్న చెంచలి, అడవిసోయ, దొగ్గలి, ముల్లుదొగ్గలి, బంకంటి, పెత్తకాశ, ఎర్రకాశ, తెల్లబచ్చలి, ఎర్ర, తెల్లపుండి, ఉత్తరేణి, దూసరి, చెన్నంగి, తగిరెంచ తెల్లగర్జ, చామగడ్డ, పోతపత్రం, ఎర్రగర్జ, సన్నవాయి, నాగచెవిలి, గునుగు, మునగకూర, సన్నవాయిలి, ఎర్రగునుగు, చిత్రమశం, తడకదొగ్గలి, గంగవాయిలి, చిన్నకాశ, పప్పుకేర, గుర్మాశి తదితర ఆకూరలు లభిస్తాయని వివరించారు. ఇదిలా ఉండగా సందర్శకులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు ఆకుకూరల వినియోగం, పండించే విధానంపై డీడీఎస్ మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. డీడీఎస్ మహిళా రైతులు 20 రకాల ఆకుకూరలతో తయారుచేసిన వంటల భోజనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆకు కూరల రుచులను చూసి సందర్శకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, రమేష్, డీడీఎస్ ఉద్యోగులు మాణిక్యం, జనరల్‌నర్సమ్మ, చిన్ననర్సమ్మ, మంజుల, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొలాల్లో సహజ సిద్ధంగా లభించిన ఆకు కూరలు

'అక్షరమాల'తో నిరుపేద విద్యార్థులకు అండ

● ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



అక్షరమాల వలంటీర్లకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, ఆగస్టు 25 : అక్షరమాల పేరిట ఐఐటీ-హెచ్ నిర్వహించే కార్యక్రమంతో నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటున్నామని ఆ సంస్థ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. అక్షరమాల కార్యక్రమం నాలుగో వార్షికోత్సం ఐఐటీ-హెచ్‌లో ఆదివారం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసుల ద్వారా అకడమిక్ కోచింగ్, కెరీర్ కౌన్సెలింగ్ ఇచ్చేందుకు అక్షరమాల ద్వారా వలంటీర్లకు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు చెబుతారు. అక్షరమాల ద్వారా ప్రస్తుతం 125 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. అక్షరమాల వార్షికోత్సవం సందర్భంగా వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి.. చదువులో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. అలాగే, ఐఐటీ-హెచ్ దత్తత తీసుకున్న మెదక్ జిల్లాలోని అంతారం, సలబత్‌పూర్, మొహ్మద్‌నగర్, కన్నవరం, భుజరంపేట గ్రామల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, స్క్రీన్లు అందజేశారు.

4 కిలోమీటర్లు.. 16 మూలమలుపులు

● ప్రమాదకరంగా తేర్పోల్-కొండాపూర్

● దారి పొడవునా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు



కొండాపూర్-తేర్పోల్ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



రోడ్డుపైనే సర్కారు ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు

కొండాపూర్, ఆగస్టు 25: తేర్పోల్- కొండాపూర్‌కు వెళ్లే దారి మూలమలుపులతో ప్రమాదకరంగా ఉన్నది. మండలానికి 24 గ్రామపంచాయతీలు ఉండగా.. 16 గ్రామాలకు తేర్పోల్-కొండాపూర్ ప్రధాన రోడ్డు అనుసంధానంగా ఉన్నది. తేర్పోల్ నుంచి మండల కేంద్రమైన కొండాపూర్‌కు వెళ్లేందుకు 4 కిలోమీటర్లు మాత్రమే ఉన్నది. అయితే దారి పొడవునా 16 మూలమలుపులు, రోడ్డుపైనే వెలసిన సర్కారు ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తాయి. ఎనిమిది గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రోడ్డు. అలాగే మల్లేపల్లి శివారు పరిశ్రమల్లో పనిచేసేందుకు దాదాపు 8 గ్రామాల నుంచి కార్మికులు ఈ దారిగుండానే వెళ్తారు. అదేవిధంగా పంచాయతీలకు డిజిటల్ ఇండియా(ఆన్‌లైన్) కేబుల్స్ కోసం రోడ్డు అంచును తవ్వి మ్యాన్‌వల్స్‌ను సైతం ఏర్పాటు చేశారు. అయితే నాలుగు కిలోమీటర్ల రోడ్డు మొత్తం పిచ్చిమొక్కలు, మూలమలుపులతో ఉన్నది. దీంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతూ ప్రయాణం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

పరిపాలన అధికారులు గ్రామాలను పర్యవేక్షించాలంటే ఈ రోడ్డుపైనే ప్రయాణించాలి. రోజుకో, వారానికో ఏదో ఒకశాఖ అధికారి వెళ్తుంటారు. మూలమలుపులను చూసినా.. పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడి తొలగింపు

హత్నూర, ఆగస్టు 25: మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోపి శనివారం 9వ తరగతి విద్యార్థి బాలరాజును చితకబాది గాయపర్చడంతో ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నామని అన్నారు. అదేవిధంగా తదుపరి చర్యల కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

సంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈగా శ్రీనాథ్



శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25: సంగారెడ్డి జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈగా శ్రీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్ఈగా ఇక్కడ పనిచేసిన మాధవరెడ్డి సరూర్‌నగర్ ఎస్ఈగా బదిలీపై వెళ్లారు. సంగారెడ్డి జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన శ్రీనాథ్‌ను విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, నాయకులు ఈశ్వరప్ప, గోవిందరావు, వీరయ్య, వెంకటేశం, శ్రీకర్‌రెడ్డి, కొండన్న, శ్రీశైలం, శ్రీనివాసరావు, రాజేశ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పిచ్చికుక్క దాడిలో పాడి గేదె మృతి



మృతిచెందిన పాడిగేదె

కల్హేర్/నారాయణఖేడ్, ఆగస్టు 25: పిచ్చి కుక్క దాడిలో పాడిగేదె మృతిచెందింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం, బాచేపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పుట్టి సాయిలుకు చెందిన పాడిగేదెపై ఆదివారం పిచ్చి కుక్క దాడి చేయడంతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బాచేపల్లితో పాటు, మండల పరిధిలోని రాంరెడ్డిపేట్‌లో కూడా కొందరు వ్యక్తులను కుక్కలు గాయపర్చినట్లు గ్రామస్థులు తెలిపారు. 15 రోజుల క్రితం బాచేపల్లి గ్రామానికి చెందిన వాటర్‌మన్ సాయిలును కుక్కలు గాయపర్చిన విషయం విధితమే. ఈ సమస్యను గ్రామ కార్యదర్శికి విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా కుక్కల బెడద నుంచి బాచేపల్లి గ్రామస్థులను రక్షించాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు..



మృతిచెందిన గొర్రెలు

మద్దూరు, ఆగస్టు 25: కుక్కల దాడిలో 14 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మద్దూరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సిద్ధిక్‌కు చెందిన గొర్రెల షెడ్డులోకి శనివారం రాత్రి 9.30 గంటకు చొరబడిన కుక్కలు 14 గొర్రెలపై దాడిచేయడంతో మృతిచెందాయి. దీంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నాడు. అలాగే కుక్కల బెడదను తీర్చాలన్నాడు.

తల్లీకూతురు అదృశ్యం



కుమార్తె అలేఖ్యతో కవిత(ఫైల్)

తూప్రాన్, ఆగస్టు 25: తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన తూప్రాన్ మండలం ఇమాంపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కవిత ఈనెల 22న తన కుమార్తె అలేఖ్యతో కలిసి తూప్రాన్‌లో బంధువులను పరామర్శించేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. కానీ సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త స్వామి చుట్టుపక్కల, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడి మృతి



శ్రీనివాస్(ఫైల్)

చిలప్‌చెడ్, ఆగస్టు 25: బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడు ఆదివారం మృతిచెందాడు. చిలప్‌చెడ్ మండలం భద్రతండా పంచాయతీ బంజారానగర్‌కు చెందిన జరుపుల శ్రీనివాస్(38) కొన్నేళ్లుగా గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కొన్నినెలల క్రితం పక్షవాతం వచ్చి.. చెయ్యి, నోరు సరిగ్గా పనిచేయకపోవడంతో చికిత్స తీసుకున్నాడు. ఈ మధ్య బాగానే ఉన్నా.. వారంరోజుల క్రితం మరోమారు పక్షవాతం పనిచేయకపోవడంతో చికిత్స తీసకున్నాడు. ఈ మధ్య బాగానే ఉన్నపటికీ వారం రోజుల క్రితం మరోమారు పక్షపాతం రావడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం బ్రెయిన్ డెడ్ అయి మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల

త్వరలో ఎంబీబీఎస్ మూడో బ్యాచ్!

● భర్తీ కానున్న మరో 150 సీట్లు

● 450 కి చేరుకోనున్న 'మెడికో'ల సంఖ్య

● థర్డ్ ఇయర్‌లోకి సంగారెడ్డి జీఎంసీ

● హాస్టల్ పక్కా భవనాల నిర్మాణాలు ఆలస్యం

● అద్దె భవనాల కోసం అధికారుల అన్వేషణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి(జీఎంసీ) ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల కొత్త బ్యాచ్(2024-25) రానున్నది. దీంతో ఈ కళాశాలలో ఫ్రెష్ బ్యాచ్ వైద్య విద్యార్థుల సందడి త్వరలో మొదలు కానున్నది. 2022లో ఫస్టియర్ తరగతులతో ఈ కళాశాల అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫస్టియర్, సెకండియర్ కలిసి 300 మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే రానున్న 150 మంది వైద్య విద్యార్థులను కలుపుకుని మెడికోల సంఖ్య 450 మందికి చేరుకోనున్నది. కాగా ఈ కళాశాలలో మూడో బ్యాచ్ విద్యార్థులు రానున్న నేపథ్యంలో కళాశాల అధికారులు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పక్కా 'హాస్టల్' భవనాలు ఆలస్యం

ఇదిలా ఉండగా మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో భాగంగా రెండో విడతలో రూ.143 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ వివిధ భవనాల నిర్మాణాలు చేపడుతున్నది. మెయిన్ బ్లాక్(జీ+2)తో పాటు ఎంబీబీఎస్ బాలురు, బాలికల హాస్టల్స్, స్టాఫ్ క్వార్టర్స్, కిచెన్ అండ్ డైనింగ్, బాయ్స్ రెసిడెంట్ హాస్టల్, మార్చురీ తదితర భవన నిర్మాణ పనులు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. అయితే జీ+6 అంతస్తుల్లో ఎంబీబీఎస్ బాలుర హాస్టల్, జీ+8 అంతస్తుల్లో బాలికల హాస్టల్స్ పక్కా భవనాల పనులు జరుగుతున్నాయి. వచ్చేనెలలో కొత్త బ్యాచ్ మెడికోలు రానుండటంతో వసతి ఉండేందుకుగాను హాస్టల్ పక్కా భవనాలు ఇంకా సిద్ధం కాలేవు. తుది దశలోనే నిర్మాణాలు ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో బిల్లులు రావాల్సి ఉన్నది. అందుకే కొన్నిరోజులుగా భవన నిర్మాణ పనులు నెమ్మదించాయి. ఇటీవల మంత్రి దామోదర పర్యటించగా, పనుల్లో వేగం పెంచారు. కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చేవరకు సదరు కాంట్రాక్టర్ ఆ భవనాలు అప్పగించేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. పక్కా భవనాల నిర్మాణాలు మరింత ఆలస్యం కానుండటంతో చేసేదేమీ లేక మెడికల్ కాలేజీ అధికారులు అద్దె భవనాలు వెతికే పనిలో పడ్డారు. ఇప్పటికే ఆరు నెలల కాలానికి అద్దె భవనాలు కావాలంటూ కళాశాల అధికారులు ప్రకటన జారీచేశారు.

ఎన్ఎంసీ ఆదేశాల మేరకు తరగతులు



వచ్చేనెలలో మూడో బ్యాచ్ ఫస్టియర్ 150 మంది విద్యార్థులు కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్ పొందనున్నారు. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు అక్టోబరు 1 నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రానున్న వైద్య విద్యార్థుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. కళాశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న హాస్టల్స్ భవనాలు ఇంకా అప్పగించలేదు. ఇంకా నిర్మాణాలు పూర్తికావాల్సి ఉన్నది. అందుకోసం అద్దె భవనాల పరిశీలన చేస్తున్నాం. వసతితో పాటు బోధనకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం.

- డా.సుధామాధురి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, సంగారెడ్డి



నిర్మాణ దశలో వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలు

అద్దె భవనాల్లో మళ్లీ హాస్టల్స్

వైద్య విద్యార్థుల వసతి కోసం ఈసారి కూడా మళ్లీ అద్దె భవనాలే దిక్కయ్యాయి. కళాశాల ప్రారంభమైన తొలి ఏడాది వైద్య విద్యార్థుల నుంచి ఇప్పటివరకు మెడికోలకు పక్కా భవనాలు సిద్ధం కాకపోవడంతో అద్దె భవనాల్లోనే ఉండాల్సి వస్తున్నది. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాతో పాటు బైపాస్ రోడ్డులోని పలు భవనాల్లో వసతి కొనసాగిస్తున్నారు. ఆయా హాస్టల్స్‌లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

- ఆదివారం కావడంతో కొమురవెల్లి, నాచగిరిలో రద్దీ
- గ్రామాల్లో బోనాల సందడి

చేర్యాల, ఆగస్టు 25: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ప్రాంగణాలు సందడిగా మారాయి. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్‌కుమార్‌గౌడ్ ఆదివారం కుటుంబసమేతంగా మల్లన్నను దర్శించుకున్నారు. ముఖమండపంలో పట్నంవేయించి స్వామివారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు స్వామి వారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్, సార్ల సురేశ్, బీసీ వెల్ఫేర్ సీనియర్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దక్షిణమధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూజానంతరం అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పడిగన్నగారి ఆంజనేయులు, మహదేవుని సాంబయ్య తదితరులు శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు.

మర్పడగలో జిల్లా న్యాయాధికారి పూజలు

కొండపాక, ఆగస్టు 25: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మేడ్చల్-మల్కాజిగిరి కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి అర్జున్ కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన అభిషేకంలో స్వయంగా పాల్గొని విజయ దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ సబ్ జడ్జిని శేష వస్త్రాలతో సత్కరించారు.

నాచగిరి క్షేత్రంలో శ్రావణమాస సందడి

వర్గల్, ఆగస్టు 25: నాచారం నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారుల తీరారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలోని ఆలయ సత్యనారాయణస్వామి వ్రత మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు. వర్గల్ కేంద్రంలోని విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయంతో పాటు క్షేత్రంలోని ఉప ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు మహా అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

గ్రామాల్లో బోనాల సందడి

ములుగు, ఆగస్టు 25: మండల పరిధిలోని కొక్కొండలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. మాజీ ఎంపీపీ లావణ్య అంజన్నగౌడ్ బోనం ఎత్తుకున్నారు. అలాగే శిరసాల గ్రామంలో మాజీ ఎంపీటీసీ కొన్యాల మమత, మాజీ ఎంపీటీసీ హరిబాబు, మాజీ సర్పంచులు వెంకటరెడ్డి, యాదమ్మ, నరసింహారావు, గణేష్‌ల ఆధ్వర్యంలో బోనాల పండుగ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, కేటీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాల్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయంలో పట్నం రచించి మొక్కులు తీర్చుకుంటున్న బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్

- **కుకునూరుపల్లి:** బొబ్బయిపల్లిలో పోచమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు చేసి పోచమ్మ, మైసమ్మలకు సమర్పించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సభ్యురాలు కోల సద్గుణ మాజీ సర్పంచ్ కోల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

తొగుట, ఆగస్టు 25: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మార్కండేయస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి 28 వరకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



వర్గల్: నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కుకునూరుపల్లి: బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న బొబ్బయిపల్లి గ్రామస్థులు



కొండపాక: మర్పడగ క్షేత్రంలో పూజలు చేస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి అర్జున్, కుటుంబసభ్యులు

పిచ్చి కూతలు కూయడం మానుకోవాలి

- 7వ వార్డు కౌన్సిలర్ ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి



మాట్లాడుతున్న ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25: నిరాధారమైన ఆరోపణలు, పిచ్చి కూతలు కూయడం సిద్దిపేట బీఆర్ఎస్ నాయకులు, క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు ఇకనైనా మానుకోవాలని 7వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల శ్రీదేవిబుచ్చిరెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి ప్రజలను, అధికారులను బెదిరిస్తూ స్టేడియాన్ని కొందరు తమ ఆస్తిలాగా వాడుకుంటున్నారని ఆరోపించారు. స్టేడియంలో ట్రోఫీల పేరిట, కోచింగ్ క్యాంపులంటూ ఏడాది పొడవునా డబ్బులు దోచుకున్నారని, పైగా ఎలాంటి సంబంధం లేకున్నా తన పేరును ప్రస్తావించడం సరైందికాదన్నారు. గ్రౌండ్ విషయంలో తాను ఏ అధికారికి ఫోన్ చేయలేదని, చేశానని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. రుజువు చేయకుంటే అసోసియేషన్ నిర్వాహకులు మైదానంలో ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 25: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్ కోరారు. హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో కిషన్‌నాయక్ మాట్లాడారు. డీఏ మంజూరు చేయాలని, 317 జీవో ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మండల సభ్యులు శంకర్, కోములు, తిరుపతి, కిషన్, నెహ్రూ, కాళీదాస్, శ్యామల, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి మగ్దూమ్ మొహియుద్దీన్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 25: స్వాతంత్ర్య ఉద్యమకారుడు తెలంగాణా రైతాంగా పోరాట వీరుడు, కార్మిక నేత, విప్లవ కవిగా దేశం గర్వించదగ్గ వ్యక్తిగా ఎదిగిన మహానుభావుడు మగ్దూమ్ మొహియుద్దీన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆదివారం మగ్దూమ్ మొహియుద్దీన్ 56వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మొహియుద్దీన్ తన చిన్నతనం నుంచే అభ్యుదయ భావాలు కలిగి దేశం, ప్రపంచంపై అవగాహన కలిగిన వ్యక్తి అని గుర్తు చేశారు. తెలంగాణా రైతాంగా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డితో పాటు మగ్దూమ్ మొహియుద్దీన్ కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడిపెమల్లేశం, సత్యనారాయణ, ఎడల వనేష్, శంకర్, లక్ష్మణ్, భాస్కర్, గోపి, జనార్దన్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మొహియుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బీసీల రిజర్వేషన్ల కోసం పోరాడిన మహనీయుడు..

- బీపీ మండల్ జయంతిలో నాయకులు

చిన్నకోడూరు, ఆగస్టు 25: బీసీల రిజర్వేషన్‌ల కోసం పోరాడిన మహనీయుడు బీపీ మండల్ అని కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు బంక చిరంజీవి యాదవ్ కొనియాడారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆదివారం చిన్నకోడూరులో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి జంగిటి బాల్‌రాజు, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు మేకల ఎల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు అజ్జు యాదవ్, నాయకులు పోచమల్లు, కరుణాకర్, సాగర్, బాబు మియా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **హుస్నాబాద్‌రూరల్:** బీసీ రిజర్వేషన్ల స్ఫూర్తి ప్రదాత అభినవ అంబేడ్కర్, మండల కమిషన్ నిర్మాత బీపీ మండల్ జయంతిని హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల నాయకులు, జేఏసి ఆధ్వర్యంలో నిర్వహించారు. బిపి మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ మాట్లాడుతూ.. బీపీ మండల్, జాతీయ బీసీ కమిషన్ రెండో చైర్మన్‌గా దేశవ్యాప్తంగా ఉన్న 3743 బీసీ కులాల కోసం సామాజిక విద్య, వైద్య, ఆర్థిక, ఉపాధి అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేసి బీసీల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, జేఏసీ నాయకులు కొయ్యడ కొంరయ్య, బీఎస్పీ మండల అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు తదితరులు ఉన్నారు.



చిన్నకోడూరులో బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

గజ్వేల్, ఆగస్టు 25: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను కొడకండ్ల టీచర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఇటీవల పదోన్నతి పొందిన దూలం వెంకటయ్య, గజ్వేల్ సాయికిరణ్‌ను టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుప్పతి రాములు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఎస్జీటీగా 21సంవత్సరాలు సేవలు అందించిన తర్వాత తమకు పదోన్నతి లభించడం సంతోషంగా ఉందన్నారు. వారితో కేటీఏ సభ్యులు శ్రీనివాస్‌రావు, రాంచంద్రం, శ్రీశైలం, ప్రభాకర్, రాము, వేణుగోపాల్, భాస్కర్ ఉన్నారు.

'కుటుంబాన్ని ఆదుకోవాలి'

దుబ్బాక, ఆగస్టు 25: దుబ్బాక 108 సర్వీస్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖైరంకొండ లింగం బిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో అనారోగ్యకారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. కంచరత్త గ్రామంలో ఆదివారం బాధిత కుటుంబాన్ని ఈఎమ్ఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి మెదక్ జిల్లా మేనేజర్ జనార్దన్‌తోపాటు సిబ్బంది ఎల్లప్ప, ప్రభాకర్, స్వామిలు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిబ్బంది కోరారు.

అనాథ పిల్లలకు చేయూత

జగదేవ్‌పూర్, ఆగస్టు 25: మండలంలోని ఇటిక్యాలకు చెందిన శేఖర్, సౌమ్య దంపతులు నెల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రులు ఆత్మహత్యతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్‌లోని మనం ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఇటిక్యాల గ్రామంలో పిల్లలను పరామర్శించి, 10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనాథ పిల్లలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కనకయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి పరామర్శ

కుకునూరుపల్లి, ఆగస్టు 25: మంగోల్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముప్పం శ్రీనివాస్ గౌడ్ తల్లి పది రోజుల క్రితం మృతి చెందింది. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనవెంట గజ్వేల్ పెంటాగౌడ్, నాగరాజుగౌడ్, సాయిబాబగౌడ్, తదితరులున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 25: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. హుస్నాబాద్‌లో జనవికాస ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బాల వికాస ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, తదితరులు ఉన్నారు.

'పార్కులను అందుబాటులోకి తేవాలి'



పాండవుల చెరువును పరిశీలిస్తున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 25: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన పార్కులను, టూరిజం స్పాట్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు టూరిజం స్పాట్‌ను ఆదివారం సీఐటీయూ నాయకులు రంగారెడ్డి, సాధు రవికుమార్, కొట్టాల యాదగిరితో కలసి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

కొండపాక, ఆగస్టు 25: కొండపాక గ్రామనికి చెందిన గుమ్మడిదల మహేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి ఆదివారం స్థానిక నాయకులతో రూ. 10వేల ఆర్థిక సహాయం అందించారు.

అసత్య ఆరోపణలు తగవు

- కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, ఆగస్టు 25: రైతాంగానికి ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీపై బీఆర్ఎస్, సీపీఎం నాయకులు అసత్యఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. రుణమాఫీపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రుణమాఫీ చేయడంతో రైతాంగం సంతోషంతో విజయోత్సవాలు జరుపుకుంటుంటే ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లల ఆడెపు నరేందర్, చెవిటి లింగం, ముస్త్యాల తార, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మిరుదొడ్డి, ఆగస్టు25 : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, ప్రభుత్వం రైతులకు చేస్తున్న రెండు లక్షల రుణమాఫీని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేస్తున్నారని అల్వాల గ్రామ తాజామాజీ సర్పంచు కిష్టయ్య కనకారెడ్డి, రాజులు మండిపడ్డారు. మిరుదొడ్డిలో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వ రైతులకు విస్మరించిందని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, నర్సింహులు, నర్సింహారెడ్డి తదితరులున్నారు.



చేర్యాలలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పాఠశాలల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అంబిటస్ స్కూల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 25: సిద్దిపేటలోని మెరీడియన్, అంబిటస్ స్కూల్స్‌లో ముందస్తుగా ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడిగా, విద్యార్థినిలు గోపికలుగా వేషధారణ వేసి సందడి చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

భద్రాద్రి రాముడి ముత్యాల తలంబ్రాల పంపిణీ



ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేస్తున్న రామకోటి రామరాజు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 25: భద్రాచలం శ్రీరామచంద్రుడి ముత్యాల తలంబ్రాలు సిద్దిపేటకు చేరుకున్నాయి. శ్రీరామకోటి భక్తసమాజం, ధార్మిక సేవా సంస్థ సేవలను గుర్తించి భద్రాచలం నుంచి వంద కిలోల ముత్యాల తలంబ్రాలను పంపించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు రామయ్య తలంబ్రాలను ఆదివారం సిద్దిపేటలోని శ్రీ మార్కేండయ ఆలయంలో భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామభక్త సేవాబృందం సభ్యులు లక్ష్మన్, భైరి మురళీ, అయిత శ్రీకాంత్, కాసోజు శ్రీనివాస్, కరోళ్ల చిరంజీవి, తంగలపల్లి నరేష్, అర్చకులు మలిపెద్ది నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అందరికీ నాణ్యమైన విద్య

- హైదరాబాద్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ రవీంద్రనాథ్ సాల్మన్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 25: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా నాణ్యమైన విద్య అందరికి అందుతున్నదని హైదరాబాద్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ రవీంద్రనాథ్ సాల్మన్, అంబేడ్కర్ యూనివర్శిటీ అదనపు ఎగ్జామినేషన్ కంట్రోలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ సిద్దిపేట రీజనల్ స్టడీ సెంటర్‌ను ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సిద్దిపేట రీజనల్ కో ఆర్డినేటర్ సీహెచ్. మధుసూదన్, పడాల లక్ష్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అడ్మిషన్స్ పెంపుదల గురించి చర్చించారు.



కోర్సుల వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

చేర్యాల పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్‌కు ఒమెగా ఆస్పత్రి చేయూత

- రూ.4.50 లక్షల విలువైన సామగ్రి అందజేత



ఆస్పత్రి వారు అందజేసిన యూనిఫాంలో విద్యార్థులు

చేర్యాల, ఆగస్టు 25: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు ఒమెగా ఆస్పత్రి ముందుకువచ్చింది. ఈమేరకు రూ.4.50లక్షల విలువగల ఫర్నీచర్, ఇతరత్రా సామగ్రిని ఇటీవల చేర్యాల పెద్దమ్మగడ్డ బాలుర జడ్పీఎస్ఎస్‌కు అందజేసింది. పాఠశాల తరగతి గదులు, కార్యాలయం, కంప్యూటర్ ల్యాబ్, ఉపాధ్యాయుల సమావేశగదికి ఫర్నీచర్ సమకూర్చడంతో పాటు ఫ్లోరింగ్ కూడా చేయించింది. విద్యార్థులకు ఆకర్షణీయమైన యూనిఫాంనూ అందచేసింది. దీంతో పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ ఇతర పాఠశాలలకు భిన్నంగా కార్పొరేట్ లుక్ సంతరించుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయురులు నాగమణి, ఉపాధ్యాయులు ఒమెగా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైడ్రా పేరుతో కాంగ్రెస్ హైడ్రామా

- మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి

చేర్యాల, ఆగస్టు 25: హైడ్రా పేరిట ప్రభుత్వం హైడ్రామా నడుపుతున్నదని, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసుల బనాయించడం తగదని చేర్యాల మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి ఆరోపించారు. చేర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ తమ నీలిమా ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్న నిస్వార్థపరుడన్నారు. రాజకీయ ఎదుగుదలతో పాటు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారన్న అక్కసుతో అనురాగ్ యూనివర్సిటీ విద్యాసంస్థలను కూల్చాలని కుట్రలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం తగదన్నారు. రుణమాఫీపై రైతుల్లో మూటగట్టుకున్న వ్యతిరేకతను దృష్టి మరల్చడానికే హైడ్రామాకు తెరదీసిందని, ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో కబ్జా భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దౌల్తాబాద్ మాల మహానాడు కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్, ఆగస్టు 25: దౌల్తాబాద్ మండల మాల మహానాడు నూతన కమిటీని ఆదివారం నియమించారు. మాల మహానాడు మండల అధ్యక్షుడిగా బొల్లంరాజేష్, మండల ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాక్షులుగా సంబగా రాజేందర్, మద్దెల శ్రీకాంత్, బైండ్ల నరేష్, బైండ్లస్వామి, ఉప కార్యదర్శిగా చెన్న బీమరాజు, కార్యవర్గ సభ్యులుగా గొల్లపల్లి శ్రీకాంత్, దారస్వామి, బండారు దేవేందర్, మద్దెల భిక్షపతి, జెర్ర శ్రీకాంత్, సోషల్ మీడియా అధ్యక్షులుగా సుధాకర్, గొల్లపల్లి పవన్, గొల్లపల్లి నవీన్, తదితరులను నియమిస్తూ మాల మహానాడు జాతీయ తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీ అధ్యక్షుడు బొల్లం రాజేష్ మాట్లాడుతూ.. మాల మహానాడు సంఘం బలోపేతం కోసం కృషి చేసాన్నన్నారు. కార్యక్రమంలో అయా గ్రామాల మాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వన్‌వేతో అవస్థలు



జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక గాంధీచౌక్ వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టిన క్రమంలో వన్‌వేలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతున్నది. ప్రత్యామ్నాయచర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- చేర్యాల

గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- చోరీ కేసుల దర్యాప్తులో పోలీసులకు తిప్పలు

నంగునూరు, ఆగస్టు 25: నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ప్రధాన చౌరస్తాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని వాడుకలోకి తేలేకపోతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగి నప్పుడు ప్రధాన ఆధారం సీసీ కెమెరాలే. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తరచూ మరమ్మతులకు గురి కావడంతో బాగుచేయలేక వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. కోతుల బెడదతో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, దీంతో గ్రామాల్లో జరుగుతున్న చోరీలను ఛేదించడంలో పోలీసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు చెబుతున్నారు. రాజగోపాలపేట పోలీసులు దాతల సహకారంతో మూడేళ్ల క్రితం మండలంలోని 24 పంచాయతీల్లో సుమారు 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. చాలాచోట్ల అవి పనిచేయడం లేదు. గతంలో నాగరాజుపల్లిలో జరిగిన మేకల చోరీని ఛేదించడానికి పోలీసులకు మూణ్నెల్లుపట్టింది. నంగునూరు మండలంలోని మైసంపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు, నంగునూరు నల్ల పోచమ్మ ఆలయం, సిద్దన్నపేట మహంకాళి ఆలయం, గట్ల పెద్దమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. నంగునూరు మండల కేంద్రంలోని పీమార్ట్ షాప్‌లో ఏడు లక్షల దొంగతనం జరిగింది. సీసీ కెమెరాలు ఉండి ఉంటే పైదొంగతనాల కేసులను సకాలంలో ఛేదించేవారని చెబుతున్నారు. గతంలో వివిధ గ్రామాల్లో మేకల దొంగతనం జరిగినప్పటికీ ఇప్పటివరకు రికవరీ చేయలేకపోయారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు బాగు చేయించినట్లయితే దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు అరికట్టవచ్చని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు చొరవ తీసుకుని కెమెరాలకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నర్మెటలో పనిచేయని సీసీ కెమెరా